ఇల్లు పీకి పందిరేస్తున్నయ్..

- పల్లెల్లో కోతుల బెడద
- ఇళ్లలోకి చొరబడుతున్న వైనం
- ఇంటి కప్పు తొలగిస్తూ.. కనబడినవారిని గాయపరుస్తూ..
- రోడ్డుకిరువైపులా వానరాలతో వాహనదారుల ఆందోళన



మల్యాలలో ఓ ఇంటిపై కోతులు

మల్యాల: ఇంటి తలుపులు తెరిస్తే చాలు.. కోతులు ఇంట్లో చొరబడి తినుబండారాలు ఎత్తుకెళ్లడంతోపాటు దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్ల వెంట సైతం తిరుగుతుండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం కోతులు దాడులు చేస్తుండడంతో ప్రజలు ఆస్పత్రికి పరుగులు పెడుతున్నారు.

మల్యాల మండలంలోని పల్లెల్లో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. ఉదయం నుంచే కోతులు ఇళ్లపై ఆటలాడుతూ విన్యాసాలు చేస్తున్నాయి. గతంలో ఇళ్ల పైకప్పుల మరమ్మతు పనులు మూడేళ్లకోసారి చేపట్టగా.. కోతులు ఇళ్లపై పెంకులు తొలగిస్తుండడంతో ఏటా ఇళ్ల మరమ్మతు చేపట్టాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతుల దాడులతో గాయాలు

ముత్యంపేట, మల్యాల, తాటిపల్లి, లంబాడిపల్లి, రామన్నపేట, నూకపల్లి తదితర గ్రామాలతోపాటు దాదాపు అన్ని గ్రామాల్లో కోతులు గుంపులుగుంపులుగా తిరుగుతుండడంతోపాటు ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. బాధితులు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. ఈ ఏడాది జనవరిలో 47 మంది కోతుల దాడిలో గాయపడగా.. ఫిబ్రవరి 18 నాటికి 38 మంది గాయపడి మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ తీసుకొని చికిత్స పొందుతున్నారు. 2024 జనవరి నుంచి 2025 జనవరి నాటికి 450 మంది గాయపడడం మల్యాలలో కోతుల దాడుల పరిస్థితికి అద్దం పడుతోంది.

ప్రచార అస్త్రం..

నిత్యం కోతులు ఇళ్లలోకి వస్తూ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులపై సైతం దాడులు చేసి గాయపరుస్తున్నాయి. తలుపు తెరిస్తే ఇంటి లోపలికి వెళ్లి ఇంట్లో వస్తువులు ఎత్తుకెళ్తూ దాడి చేస్తున్నాయి. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో కోతుల దాడులతో ప్రజలు బెంబేలెత్తిపోతుండడంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ సమస్య ప్రధాన ప్రచార అస్త్రం కానుంది. బాధితులు మాత్రం తమ ఓటు ఈ సమస్య పరిష్కరించే వారికేనంటూ బహిరంగంగా ప్రచారం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహులు వానరాల సమస్య తీర్చుతామంటూ ప్రజలకు అభయమిస్తుండడంతో.. ఎన్నికల్లో ప్రధాన ప్రచార అస్త్రంగా మారనుంది.

కోతుల సమస్య తీర్చేవారికే ఓటు



మల్యాల గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఇళ్ల పైకప్పులు తీసేస్తూ డిష్ తీగ తెంపేస్తున్నాయి. తలుపు తెరిస్తే ఇంట్లోకి దూరుతున్నాయి. కోతులను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తే దాడులు చేసి గాయపరుస్తున్నాయి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కోతుల సమస్య పరిష్కరించేవారికే ఓటేస్తా.

– అల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయ రెడ్డి సంఘం సభ్యుడు

అందుబాటులో వ్యాక్సిన్లు



కోతుల దాడిలో గాయపడిన వారు నిత్యం వస్తున్నారు. కుక్కలు, కోతుల దాడిలో గాయపడి ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆస్పత్రిలో అందరికి వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. గాయపడిన వారికి వ్యాక్సిన్ ఇస్తూ.. ఏయే తేదీల్లో వ్యాక్సిన్ తీసుకోవాలో అవగాహన కల్పిస్తూ వ్యాక్సిన్ వేస్తున్నాం.

– డాక్టర్ మౌనిక, మల్యాల మండల వైద్యురాలు



మహాలక్ష్మి రూపంలో శివలింగం

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో శుక్రవారం రాత్రి శివ భక్తులు శివ నామస్మరణతో హోరెత్తించారు. మహాలక్ష్మి రూపంలో అలంకరించిన శివలింగం ఆకర్షణగా నిలించింది. భక్తులు, శివ స్వాముల దర్శన అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు.



ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జాతర

కథలాపూర్: చింతకుంట గ్రామంలో శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో యజ్ఞం నిర్వహించి స్వామివారి కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.



అభిషేకంతోనే శివుడి అనుగ్రహం

కోరుట్ల: అభిషేకంతోనే శివుడు అనుగ్రహిస్తాడని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ అన్నారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో సనాతన ధర్మ సమితి ఆధ్వర్యంలో శ్రీలింగ మహా పురాణ సప్తాహంలో భాగంగా ప్రవచనాలు చేశారు. షొడశోపచార, పంచోపచార, అలంకార సేవలు ఏమి లేకుండా శుద్ధ జలంతో ఓం నమఃశివాయ అంటూ అభిషేకిస్తే శివుడు ప్రసన్నమవుతాడన్నారు. ధర్మ ప్రచార కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మంచాల జగన్, బట్టు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఒలిపిడి మొక్కలను తొలగించాలి

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సాగు చేసిన వరి పంటలో ఒలిపిడి మొక్కలు(కలుపు మొక్కలు) పెరిగి పంటను దెబ్బతీస్తాయని, ఒలిపిడి మొక్కలను వేర్లతో సహా తొలగించాలని వ్యవసాయ వర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు వెల్ముల రాంరెడ్డి రైతులకు సూచించారు. మొక్కలే కదా అని నిర్లక్ష్యం చేస్తే అవి ఎదిగి ధాన్యం నాణ్యతను చెడగొట్టే అవకాశముందని పేర్కొన్నారు.

క్రైం కార్నర్..



ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు

మల్యాల: మండలంలోని రాజారం శివారులో శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలను కారు ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాల అర్బన్ మండలం తారకరామనగర్‌కు చెందిన ముగ్గురు టీఆర్‌నగర్ వెళ్తుండగా జగిత్యాల -కరీంనగర్ రహదారిపై రాజారం శివారులో ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతోపాటు ముందు వెళ్తున్న మరో స్కూటీని సైతం ఢీకొట్టడంతో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటనలో బైక్ నుజ్జునుజ్జు కాగా, టీఆర్‌నగర్‌కు చెందిన లక్ష్మణ్, కోటీ భీం, సమీరాతోపాటు రాజారం గ్రామానికి చెందిన తాండ్ర శివ, మంచర్ల నరేశ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన ఆగకుండా వెళ్లిపోయింది. ఘటనా స్థలానికి ఎస్సై నరేశ్‌కుమార్, సిబ్బంది చేరుకుని బాధితులను 108లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

లారీ డ్రైవర్‌కు 18 నెలల జైలు

ధర్మపురి: అజాగ్రత్తగా లారీ నడిపి నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న ఘటనలో డ్రైవర్ జాగిరి మల్లేశ్‌కు 18 నెలలు కఠిన కారాగార శిక్ష, రూ.5,500 జరిమానా విధిస్తూ ధర్మపురి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్యామ్‌ప్రసాద్ తీర్పు చెప్పారు. సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని రాయపట్నంకు చెందిన అక్కల సతీశ్, ఘటికె కృష్ణమూర్తి 2018 మే 2న ద్విచక్ర వాహనంపై రామయ్యపల్లె వెళ్తుండగా, మల్లేశ్ అజాగ్రతగా లారీ నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో కృష్ణమూర్తి అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పటి విచారణాధికారి లక్ష్మీనారాయణ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మెజిస్ట్రేట్ కేసు పూర్వాపరాలు పరిశీలించి నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పెగడపల్లి: రాములపల్లిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రవికిరణ్ తెలిపిన వివరాలు.. రాములపల్లి గ్రామానికి చెందిన అడువ నందయ్య వ్యవసాయ పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా పెగడపల్లి నుంచి రాములపల్లి వైపు వెళ్తున్న పులి రమేశ్ బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో నందయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బట్టపల్లి శివారులో..

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా.. పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం.. ధర్మపురి మండలం నేరెల్లకు చెందిన జుంజూరి నవీన్ రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బట్టపల్లి శివారులో బుగ్గారం మండలానికి చెందిన నక్క రెండ్ల పెద్దిరాజం అజాగ్రత్తగా ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో నవీన్‌కు గాయాలయ్యాయి. నవీన్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇబ్రహీంపట్నంలో పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

ఇబ్రహీంపట్నం: మండలంలో అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. కొమటికొండాపూర్ గోదావరి నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా వర్షకొండ వద్ద ఒక ట్రాక్టర్, మల్లాపూర్ మండలం నుంచి ఇబ్రహీంపట్నం మండలానికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పకీర్‌కొండాపూర్‌లో పట్టుకున్నట్లు చెప్పారు. ఆర్ఐ రేవంత్‌రెడ్డి ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

మెట్‌పల్లిరూరల్: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. రెండు, మూడు రోజుల నుంచి జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలను రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు బృందాలుగా ఏర్పడి పట్టుకుంటున్నారు. దీంతో ఇసుక వ్యాపారులు డీడీలు కట్టి ఇసుక తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కొన్నిచోట్ల ప్రభుత్వం రీచ్‌లు ఏర్పాటు చేసినా గ్రామస్తులు వాగులో నుంచి ఇసుక తవ్వకాలు చేయొద్దని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పెద్ద వాగును కొన్ని రోజుల క్రితం రీచ్‌గా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అక్కడి గ్రామస్తులు ఇసుక తవ్వకాల విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామ శివారులోని వాగులో నుంచి ఇసుక తీయొద్దని, భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదముందని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఇసుక అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపుతుండడంతో ఇసుక వ్యాపారులు మెట్‌పల్లి తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. డీడీలు చెల్లించి ఇసుక తీసుకెళ్తామని, రీచ్‌గా ఏర్పాటు చేసిన ఆత్మకూర్ పెద్ద వాగు నుంచి అనుమతులివ్వాలని అధికారులను కోరుతున్నారు. గ్రామస్తుల అభ్యంతరంతో అధికారులు అనుమతులివ్వక తర్జనభర్జన పడుతున్నారు. రెండు రోజుల నుంచి ఇసుక అనుమతులు కావాలని అధికారులపై ఒత్తిడి పెరుగుతుండడంతో.. అధికారులు ఇసుక అనుమతుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ప్రస్తుతం చర్చనీయంశంగా మారింది. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను అడగగా.. తొందర్లలోనే రీచ్ నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతులివ్వనున్నట్లు తెలిపారు.



సారంగాపూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కాలువలపై నిర్మాణం చేసిన వంతెనల సెఫ్టీవాల్స్ పూర్తి శిథిలావస్థకు చేరాయి. జగిత్యాల నుంచి సారంగాపూర్ వచ్చే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారుల్లో డి–53 ప్రధాన కాలువపై వంతెన ఇరువైపులా సెఫ్టీవాల్స్ కూలిపోయి చాలాకాలమవుతోంది. రంగపేట–ఆలూరు మధ్య డి–53 ప్రధాన కాలువపై వంతెనకు ఇరువైపులా సెఫ్టీవాల్స్ కూలిపోయి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చక్రూనాయక్, డీఈ, సెల్ నంబర్: 9652638815

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

గడువు లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



నాయికపుగూడెంలో భూమి పూజ చేస్తున్న అధికారులు

సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్దేశిత గడువులో నిర్మాణం పూర్తి చేస్తే బిల్లుల చెల్లింపుల్లో జాప్యం ఉండదని ఎంపీడీవో చౌడారపు గంగాధర్, పీఆర్ ఏఈ రాజమల్లయ్య అన్నారు. శుక్రవారం నాయికపుగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. గిరిజనులు ఇళ్ల నిర్మాణం చేసుకుంటే ప్రభుత్వం రూ.5లక్షలు అందిస్తుందని, బేస్‌మెంట్ పూర్తయితే మొదిటి బిల్లు కింద రూ.లక్ష చెల్లింపు జరుగుతుందన్నారు. గోడలు, స్లాబ్, రంగులు వంటివి పూర్తి చేస్తే పనుల కనుగుణంగా చెల్లింపులు జరుగుతాయని, నిర్ణీత గడువులో నిర్మాణాలు పూర్తయితే లబ్ధిదారుడికి పెట్టుబడి తక్కువవుతుందని పేర్కొన్నారు. ఎంపీవో సలీం, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఈజీఎస్ కంప్యూటర్ ఆపరేటర్ కోటేశ్వర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణలో మొదటిస్థానానికి గాయత్రి బ్యాంక్



గాయత్రి బ్యాంక్ ప్రారంభిస్తున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

గొల్లపల్లి/జగిత్యాల: తెలంగాణలోని కో–ఆపరేటివ్ బ్యాంకుల్లో అతిపెద్ద బ్యాంకుగా అవతరించి కో–ఆపరేటివ్ వ్యవస్థలో అగ్రగామిగా గాయత్రి బ్యాంక్ మొదటిస్థానానికి ఎదిగిందని గాయత్రి బ్యాంక్ చైర్మన్ ముత్యాల లక్ష్మారెడ్డి అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలో 57వ శాఖను ప్రారంభించారు. 2000 సంవత్సరంలో ప్రారంభించిన గాయత్రి బ్యాంక్ రూ.3,062.50కోట్ల వ్యాపారాన్ని సాధించి తెలంగాణలో అతిపెద్ద బ్యాంకుగా అవతరించిందన్నారు. ఏజీఎం బింగి తిరుపతి, బ్రాంచ్ హెడ్ నేరెళ్ల మునీందర్, పాలకవర్గ సభ్యులు సౌజన్య, రాజిరెడ్డి, సత్యం, అశోక్, శ్రీనాథ్, విజయ్, గంగాధర్, మాధవి, సతీశ్, రవికుమార్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి



నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కోరుట్ల రూరల్: పైడిమడుగు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పశువుల పాక నిర్మాణాలు, నర్సరీని ఎంపీడీవో రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. వేసవి కాలంలో మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డిమాండ్‌కు తగినట్టు మొక్కలు పెంచాలని సూచించారు. ఏపీవో మమత, టీఏ స్రవంతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులతో సమావేశం

సారంగాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాల్సిన పూర్తి బాధ్యత నాపై ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డికి ఓటు అభ్యర్థిస్తూ పార్టీ గెలుపు కోసం అనసరించాల్సిన వ్యూహంపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. విండో చైర్మన్ పొల్సాని నవీన్ రావు, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ జెడ్పీటీసీ ముక్క శంకర్, వైస్ ఎంపీపీలు బల్మూరి లక్ష్మణ్ రావు, బేతి పూర్ణచెందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో జగిత్యాల రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీపీ మహేశ్, నాయకులు గాజంగి నందయ్య, జున్ను రాజేందర్, ధర రమేశ్, ముస్కు దామోదర్‌రెడ్డి, లైఅట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం నాయకులు ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, మండల అధ్యక్షుడు శనివారం తిరుపతి, సీనియర్ నాయకులు రామగిరి మురళి, ఆగంతపు వంశీ, సంజీవ్ పాల్గొన్నారు.

తాండ్ర్యాలలో ప్రచారం

కథలాపూర్: పట్టభద్రులు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యమివ్వాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం తాండ్ర్యాల గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. మల్యాల మారుతి, వెంకటేశ్వర్‌రావు, కాసోజి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్వీఎల్ఆర్ గార్డెన్స్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రాజేందర్, కిషన్‌రావు, అంబటి భూమేశ్వర్, శ్యామ్‌సుందర్, రాంరెడ్డి, నరేందర్, బోగ రమేశ్, రఘుపతియాదవ్, రాంచంద్రం, గోవర్దన్ పాల్గొన్నారు.

విద్యార్థులను పట్టించుకోలేదు

జగిత్యాలటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణ ప్రభుత్వ ఉద్యోగిగా కళాశాలలో పని చేసిన సమయంలో విద్యార్థులను గాలికొదిలేసి కోచింగ్ సెంటర్లకు అమ్ముడుపోయాడని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ విమర్శించారు. జగిత్యాల దేవిశ్రీ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ కనుసన్నల్లో పని చేస్తున్న ప్రసన్న హరికృష్ణ బీసీల మధ్య చీలికకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. గొట్టం మహేశ్, పొన్నం అనిల్‌గౌడ్, పుల రణధీర్, శివకుమార్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

సారంగాపూర్: నాయికపుగూడెం అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం అధికారులు శుక్రవారం పరిశీలించారు. భవనం మంజూరైనా.. స్థల సేకరణలో జరుగుతున్న జాప్యం కారణంగా పనులు ప్రారంభం కాకపోవడంతో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో సలీం, పీఆర్ ఏఈ రాజమల్లయ్య స్థల పరిశీలన చేశారు.

క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



విద్యార్థులకు క్రీడాదుస్తులు అందిస్తున్న నారాయణరెడ్డి

కథలాపూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. మోడల్ స్కూల్ విద్యార్థులకు ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి రూ.10వేల విలువైన క్రీడా దుస్తులు అందించారు. ప్రిన్సిపాల్ అనిత, నాయకులు న్యావనంది శేఖర్, లింగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న మల్లేశ్‌యాదవ్

జగిత్యాలరూరల్: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని యాదవులను చైతన్యపర్చడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. యాదవ సంఘం నాయకులు ఒర్రె వేణుగోపాల్‌యాదవ్, సంపతి రాందాస్‌యాదవ్, దానవేని మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.

సీఈవోను వదిలి చైర్మన్‌కు నోటీసులా..

ఇబ్రహీంపట్నం: సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన సీఈవో మధుకర్‌ను వదిలేసి చైర్మన్‌కు నోటీసులివ్వడం ఏమిటని యామాపూర్ సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం యామాపూర్ సహకార సంఘంలో విలేకరులతో మాట్లాడారు. 2020లో చైర్మన్‌గా ఎన్నికైన తమ పాలకవర్గంలో పని చేసిన పాత సీఈవో తిరుణగిరి మధుకర్ చేసిన అక్రమాలకు స్పందించి యామాపూర్ సహకార సంఘం పాలకవర్గం జిల్లా సహకార సంఘం అధికారికి సంబంధిత అవినీతికి ఆధారాలు చూపించగా.. సీఈవో మధుకర్‌ను 2021లో తొలగించాలని తీర్మానం చేశారని అన్నారు. అవినీతికి పాల్పడ్డ సీఈవో, జిల్లా ఉన్నతాధికారులను వదిలి ఈనెల 3న తనకు నోటీసులివ్వడం ఏమిటని ప్రశ్నించారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

మల్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఉపాధిహామీ పథకంలో భాగంగా 2021 నుంచి 2024 వరకు కనీసం వంద రోజులు పూర్తి చేసి 45 ఏళ్లలోపు చదువుకున్న యువతీ, యువకులకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ నిర్వహించారు. శిక్షణలో మల్యాల మండలం నుంచి 37 మంది, గొల్లపల్లి నుంచి 8, పెగడపల్లి నుంచి 9, జగిత్యాల అర్బన్ నుంచి ఐదుగురు, జగిత్యాల రూరల్ మండలం నుంచి ఆరుగురు పాల్గొన్నారు. బాలస్వామి, శ్రీనివాస్, స్వర్ణ, విజయభారత్, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం

కోరుట్ల: కాంగ్రెస్ కోరుట్ల పట్టణ అధ్యక్షురాలిగా ఎన్నికైన మచ్చ కవిత, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సోగ్రాబిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో పట్టణంలోని జువ్వాడి భవన్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్‌గౌడ్, కొంతం రాజం, నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయికల్: సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 2న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో యుద్ధభేరి నిర్వహిస్తున్నామని టీఎస్ సీపీఎస్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. శుక్రవారం రాయికల్, మైతాపూర్, తాట్లవాయి, ఆలూరు గ్రామాల్లో గోడ పత్రిక ఆవిష్కరించారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సర్వ సతీశ్, శ్రీనివాస్, గంగరాజం, నర్సయ్య పాల్గొన్నారు.